సాక్షి
శ్రీకాకుళం

బుధవారం । 31 । జూలై । 2024



తహసీల్'దారులెటో..?'

తహసీల్దార్లకు ఇంకా నిరీక్షణ తప్పడం లేదు. మూడు రోజులుగా వీరికి మండలాలు కేటాయించలేదు. - 8లో



హుండీ ఆదాయం రూ.3.90 లక్షలు

జలుమూరు: ప్రసిద్ధ శైవక్షేత్రం శ్రీముఖలింగేశ్వరుని హుండీ కానుకల ఆదాయం రూ.3,90,013 వచ్చినట్లు ఆలయ ఈఓ పి.ప్రభాకరరావు మంగళవారం తెలిపారు. ఆలయం ఆవరణలో అర్చకులు, దేవదాయ శాఖ సిబ్బంది సమక్షంలో లెక్కించారు.

1, 3 తేదీల్లో రెండు రైళ్లు రద్దు

కాశీబుగ్గ: జార్ఖండ్‌లో రైలు ప్రమాదానికి గురికావడంతో శ్రీకాకుళం జిల్లా మీదుగా నడిచే రెండు రైళ్లను రద్దు చేసినట్లు దక్షిణ మధ్య రైల్వే అధికారులు మంగళవారం ఓ ప్రకటనలో తెలియజేశారు. ఆగస్టు 1వ తేదీ హౌరా- యశ్వంత్‌పూర్ (రైలు నంబర్ 02863), మూడో తేదీ యశ్వంత్‌పూర్- హౌరా (02864) రైళ్లను రద్దు చేస్తున్నామని, పలాస, శ్రీకాకుళం రోడ్డులో దిగాల్సిన, ఎక్కాల్సిన ప్రయాణికులు గమనించి ప్రత్యామ్నాయ ప్రయాణ ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు.

న్యూస్‌రీల్

చాకిపల్లిలో అలజడి

టెక్కలి: టెక్కలి మండలం చాకిపల్లి గ్రామంలో సోమవారం రాత్రి అలజడి చోటు చేసుకుంది. సర్పంచ్ వాన తవిటయ్య, ఆయన సోదరుడు వాన నారాయణ ఎంపీటీసీ భర్త పొందర శ్రీనివాస్, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు పంగ చంద్రమౌళితో పాటు మరికొంత మందిపై గ్రామానికి చెందిన కొంత మంది వ్యక్తులు దౌర్జన్యానికి పాల్పడుతున్నారంటూ రాత్రి సమయంలో పోలీసులకు సమాచారం అందింది. దీంతో సీఐ చంద్రమౌళి, ఎస్‌ఐ వెంకటేశ్వరరావుతో పాటు పోలీస్ సిబ్బంది రాత్రి సమయంలో చాకిపల్లి గ్రామానికి చేరుకుని అక్కడ పరిస్థితులను చక్కదిద్దే ప్రయత్నాలు చేశారు. పోలీసులు కొంత సమయం గ్రామంలో పర్యవేక్షణ చేశారు. ఎలాంటి సంఘటనలు జరగకుండా పోలీసులు పహారా కాశారు. గ్రామంలో ఏం జరిగిందనే విషయమై దర్యాప్తు చేపట్టారు.

వాహనాల రిలీజ్



పోలీస్ స్టేషన్‌లో స్వాధీనం చేసుకున్న వాహనాలు

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల మండల కాంప్లెక్స్ సమీపంలోని చిలకపాలెం పంచాయతీ నారాయణపురం పరిధిలో అక్రమ క్వారీయింగ్, గ్రావెల్ తరలింపుపై ఎచ్చెర్ల ఎంపీపీ మొదలవలస చిరంజీవి ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు మేరకు రెవెన్యూ, పోలీస్, మైనింగ్ అధికారులు సంబంధిత స్థలాన్ని పరిశీలించి ఆరు టిప్పర్లు, రెండు ట్రాక్టర్లు, ఒక జేసీబీ స్వాధీనం చేసుకొని ఎచ్చెర్ల పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అయితే అధికార పార్టీ నాయకులు ఒత్తిడి చేయడంతో రూ.3400 అపరాధ రుసుం వసూలు చేసి రిలీజ్ ఆర్డర్ ఇచ్చి వాహనాలు విడిచిపెట్టేశారు. ఇన్‌చార్జి తహసీల్దార్ చక్రవర్తి మాట్లాడుతూ రెవెన్యూ, మైన్స్ అనుమతులు లేకుండా గ్రావెల్ తరలిస్తే చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

తుది విడత జిల్లా ఇంజినీరింగ్ కళాశాలల్లో ప్రవేశాలు 88.34 శాతం

ఎచ్చెర్ల క్యాంపస్: రాష్ట్ర ఉన్నత విద్యా మండలి ఏపీఈఏపీసెట్-2024 ఇంజినీరింగ్ ఎంపీసీ స్ట్రీం తుది విడత కౌన్సెలింగ్ ఈ నెల ఈ నెల 23 నుంచి 27వ తేదీ వరకు నిర్వహించారు. ఈ కౌన్సెలింగ్ అలాట్‌మెంట్లు మంగళవారం రాత్రి ప్రకటించారు. జిల్లాలో నాలుగు ఇంజినీరింగ్ కాలేజీలు ఉండగా మొదటి విడత 2154 సీట్లకు 1847 ప్రవేశాలు జరిగాయి. తుది విడతలో 1903 ప్రవేశాలు జరిగాయి. మొత్తం 88.34 శాతం ప్రవేశాలు జరిగాయి. టెక్కలి ఐతం కళాశాలలో 1104 సీట్లకు 1090, చిలకపాలెంలో శ్రీ శివానీ ఇంజినీరింగ్ కాలేజ్‌లో 384 సీట్లకు 316, ఎచ్చెర్ల శ్రీ వెంకటేశ్వర ఇంజినీరింగ్ కళాశాలలో 336 సీట్లకు 240, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలోని ఏపీజే అబ్దుల్ కలాం ఇంజినీరింగ్ కాలేజ్‌లో 330 సీట్లకు 257 ప్రవేశాలు జరిగాయి. సీట్లు లభించిన విద్యార్థులు ఈ నెల 31వ తేదీ నుంచి ఆగస్టు మధ్య కళాశాలల్లో చేరాలని సూచించారు. ప్రైవేట్ కళాశాలల్లో 30 శాతం మేనేజ్‌మెంట్ కోటాలో ప్రవేశాలు కల్పిస్తారు. ప్రభుత్వ కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తారు.

ప్రధాన మంత్రి సూర్య ఘర్ యోజన పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్, ఏపీఈపీడీసీఎల్ ఎస్ఈ కృష్ణమూర్తి

శ్రీకాకుళం పాతబస్టాండ్: ప్రధాన మంత్రి సూర్య ఘర్ యోజన పోస్టర్‌ను మంగళవారం కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ కలెక్టరేట్‌లో ఆవిష్కరించారు. తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ సూపరింటెండెంట్ ఇంజినీర్ నాగిరెడ్డి కృష్ణమూర్తి, ఇతర ఇంజినీర్లు పాల్గొన్నారు. ప్రధాన మంత్రి సూర్య ఘర్ యోజనలో భాగంగా రాయితీపై ఇంటిపై సోలార్ రూఫ్ టాప్ ఏర్పాటు చేసుకోవచ్చని, తద్వారా విద్యుత్ బిల్లులు తగ్గించుకోవచ్చని ఎస్‌ఈ వివరించారు. ఇంటి పైకప్పుపై కనీసం 10 చదరపు మీటర్ల స్థలంలో సోలార్ రూఫ్ టాప్ ఏర్పాటు చేసుకోవచ్చని వివరించారు.

ఆరుగురు పీసీలకు ఉద్యోగోన్నతి

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లాకు చెందిన ఆరుగురు పోలీస్ కానిస్టేబుళ్లకు హెడ్ కానిస్టేబుళ్లుగా ఉద్యోగోన్నతి కల్పిస్తూ ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి మంగళవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. వీరిలో జిల్లాకే చెంది మన్యం జిల్లాలో పనిచేస్తున్న ఎస్.శ్రీనివాసరావును విజయనగరం జిల్లాకు అలాట్ చేశారు. యు.నారాయణమూర్తి (శ్రీకాకుళం 2టౌన్), ఎల్.రామకృష్ణ (మెళియాపుట్టి), ఎ.పి.శ్రీనివాసరావు (క్లూస్‌టీం), బి.బాలకృష్ణ (కోటబొమ్మాళి), ఎస్.కోదండరావు (శ్రీకాకుళం 2టౌన్)లు ప్రస్తుతానికి వారి వారి స్టేషన్లలోనే విధులు నిర్వహించనున్నారు.

ఇచ్ఛాపురం స్టేషన్‌లో ఫలక్‌నుమా ఎక్స్‌ప్రెస్ జనరల్ బోగీలో ఎక్కేందుకు కష్టపడుతున్న ప్రయాణికులు





● రైలు బండి

సామాన్యులకు ధూరమండీ!

సామాన్యుడు అలుసైపోయాడు. రైలులో ఒకపూట సుఖంగా ప్రయాణించే అదృష్టానికి కూడా నోచుకోలేకపోతున్నాడు. అదనపు ఆదాయం కోసం జనరల్, స్లీపర్ బోగీలను కుదించి, ఏసీ బోగీలను పెంచేయడంతో అటు రిజర్వేషన్ చేయించలేక, ఇటు జనరల్ బోగీల్లో ప్రయాణించలేక నలిగిపోతున్నాడు. కనీసం నిలబడేందుకు కూడా ఖాళీ లేని బోగీల్లో నిత్యం నరకం చూస్తున్నాడు. అంత రద్దీలో ఊపిరాడక కాసింత గాలి కోసం డోరు వద్ద నిలబడి ఏకంగా ప్రాణాలే కోల్పోతున్నాడు.

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం:

జనరల్ కోటా జనాలపై కేంద్రం కక్ష సాధిస్తున్నట్లు కనిపిస్తోంది. రిజర్వేషన్ చేయించుకోని పాపానికి రైలు పెట్టెలో కుక్కేసి పగ సాధిస్తోంది. ఒక వేళ డబ్బులు వెచ్చించి రిజర్వేషన్ చేసుకున్నా.. అక్కడ కూడా ఇతర ప్రయాణికుల తాకిడితో ప్రయాణం నరక ప్రాయంగా మారుతోంది.

ఎలా ప్రయాణించాలి..

బోగీలు తగ్గిపోవడంతో జనాలంతా ఉన్న వాటిలోనే సర్దుకుంటూ ప్రయాణించాల్సిన పరిస్థితి దాపురించింది. డోర్ల వద్ద వేలాడుతూ, బాత్‌రూమ్‌ల పక్కన కూర్చుని ఎలాగోలా ప్రయాణం కానిచ్చేస్తున్నారు. ఒక్కోసారి డోరు వద్ద కూర్చొని కునుకు తీసి కిందకు పడిపోయిన ఘటనలు ఉన్నాయి. మరోవైపు జనరల్ టికెట్ తీసుకుని ప్రయాణించేవారు నిలబడేందుకు కూడా ఖాళీ దొరక్క స్లీపర్ క్లాసు బోగీలు ఎక్కేస్తున్నారు. దీంతో అవి కూడా నిండిపోతున్నాయి. ఈ వైఖరి వల్ల ముందుగా రిజర్వేషన్ చేయించుకున్న వారు తీవ్రంగా ఇబ్బంది పడాల్సి వస్తోంది. ముఖ్యంగా చిన్నారులు, వృద్ధుల అవస్థలు వర్ణనాతీతం. వేసవిలో దూర ప్రయాణాలు చేసే వారికైతే ఈ సమస్య ఇంకా తీవ్రంగా ఉంటోంది. ఇదంతా ఒక ఎత్తయితే ప్యాసింజర్ రైళ్లను ఎక్స్‌ప్రెస్ రైళ్లుగా మార్చేశారు. అవే స్టాప్‌లు, అదే టైమింగ్‌తో నడుస్తున్నాయి. చార్జీలు మాత్రం పెరిగాయి.

- జిల్లా రైలు ప్రయాణికులకు తప్పని కష్టాలు
- స్లీపర్, జనరల్ బోగీలను కుదించిన రైల్వే శాఖ
- జనాలతో కిక్కిరిసిపోతున్న జనరల్ బోగీలు
- డోర్ల వద్ద వేలాడుతూ ప్రమాదకర ప్రయాణం
- జిల్లా పరిధిలో ఐదేళ్లలో రైలు నుంచి జారిపడి 93 మంది మృతి

ప్రాణాలు అరచేతిలో..

జిల్లాలో శ్రీకాకుళం, ఇచ్ఛాపురం, పలాస, సోంపేట ప్రధాన రైల్వే స్టేషన్లు ఉన్నాయి. శ్రీకాకుళంలో 52 రైళ్లు, ఇచ్ఛాపురంలో 44 రైళ్లు ఆగుతాయి. శ్రీకాకుళం నుంచి విజయనగరం, విశాఖ, శ్రీకాకుళం నుంచి పలాస, సోంపేట, ఇచ్ఛాపురం, బరంపురం, ఇచ్ఛాపురం నుండి పలాస వైపు, శ్రీకాకుళం, విజయనగరం, విశాఖ వైపు నిత్యం రైళ్ల ద్వారా ప్రయాణిస్తుంటారు. దగ్గరే కదా అని జనరల్ బోగీల్లో ప్రయాణించడానికి ఇష్టపడతారు. వీరందరికీ జనరల్ బోగీల రద్దీతో ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని ప్రయాణించాల్సి వస్తోంది. అలాగే, శ్రీకాకుళం, ఇచ్ఛాపురం పరిసర ప్రాంతాల నుంచి హైదరాబాద్, చెన్నై, ముంబై, కోల్‌కతా, అహ్మదాబాద్ వంటి ప్రదేశాలకు అధిక సంఖ్యలో వలస కూలీలుగా వెళ్తుంటారు. వీరంతా జనరల్ బోగీల్లో ప్రయాణించే వారే. జనరల్ బోగీలు ఎక్కి బాత్రూమ్‌ల వద్ద, రైళ్ల డోర్లు వద్ద ప్రమాదకరంగా ప్రయాణం సాగిస్తున్నారు.



రన్నింగ్‌లో ఉన్న యశ్వంతపూర్ సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ జనరల్ బోగీలో వేలాడుతూ వెళ్తున్న ప్రయాణికులు

ఇలాంటివి ఎన్నో..

- శేఖర్ ముఖర్జీ అనే ప్రయాణికుడు ఖరగ్‌పూర్ నుంచి ఫలక్‌నామా ఎక్స్‌ప్రెస్‌లో బయలుదేరాడు. తనతో పాటు భార్య, ఇద్దరు కుటుంబ సభ్యులతో కలిపి నాలుగు స్లీపర్ క్లాస్ బెర్తులు రిజర్వు చేయించుకున్నారు. కానీ రైలెక్కాక బెర్తుల్లో వేరెవరో కూర్చుని ఉన్నారు. కాలు తీసి పెట్టడానికి కూడా లేదని, ఖుర్దా జంక్షన్ వచ్చాక కొంత ఖాళీ అయిందని... దీంతో అవస్థలు పడ్డామని శ్రీకాకుళం వరకు ప్రయాణం చేసిన తోటి ప్రయాణికులతో చెప్పి బాధపడ్డారు.
- హౌరా నుంచి బెంగళూరు వెళ్తున్న ఎస్ఎంవీటి బెంగళూరు సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌లో రంగారావు అనే ప్రయాణికుడు తన ఇద్దరు కుటుంబ సభ్యులతో స్లీపర్ క్లాస్ టికెట్‌తో కటక్‌లో ఎక్కారు. ఆయనకు భువనేశ్వర్ వచ్చే వరకు తన సీటు కోసం నానా పాట్లు పడాల్సి వచ్చింది.



హౌరా నుంచి యశ్వంతపూర్ వెళ్లే సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ జనరల్ బోగీలో కిక్కిరిసి ఉన్న ప్రయాణికులు

ప్రాణాలకే ప్రమాదం..

గత ఐదేళ్ల కాలంలో జిల్లా పరిధిలో రైలులో డోర్ల వద్ద నుంచి కింద పడి 93 మంది చనిపోయారు. గాయాలైన వారి సంఖ్య లెక్క లేదు.

సంవత్సరం	2020	2021	2022	2023	2024 (జూలై)
జారిపడి చనిపోయిన వారి సంఖ్య	7	5	26	43	12

కష్టాలు కనిపిస్తున్నాయా..?

ప్రయాణికుల క్షేమమే తమ ప్రధాన లక్ష్యమని రైల్వే శాఖ చెబుతోంది. కానీ వాస్తవ పరిస్థితులు అందుకు భిన్నంగా ఉన్నాయి. ప్రయాణికుల డిమాండ్‌కు తగినట్టుగా బోగీలు ఉండటం లేదు. ఉన్న బోగీల సంఖ్యను మరింత కుదించడం మరింత సమస్యగా మారింది. రోడ్డు రవాణా చాలా ఖర్చుతో కూడుకున్నదని రైళ్లలో నైతే చౌకగా ప్రయాణం చేయవచ్చన్నది ఇన్నాళ్లూ అనుకునేవారు. కానీ ఇప్పుడు రైలు ప్రయాణం కూడా ఖరీదవుతోంది.

రైలు నుంచి జారిపడి



55 ఏళ్ల వయసు గల గుర్తు తెలియని వ్యక్తి దూసి రైల్వే స్టేషన్ సమీపంలో ఏదో రైలు నుంచి జారి పడి చనిపోయారు. జూలై 21న ఈ ఘటన జరిగింది.

అంధుడు మృతి



ఈ ఏడాది ఫిబ్రవరిలో పలాస మండలం సుమ్మాదేవి రైల్వే స్టేషన్ సమీపంలో రైలు నుంచి ఓ అంధుడు జారి పడి మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పలాస జీఆర్పీ ఎస్ఐ కె.షరీఫ్ మృతదేహాన్ని పలాస ఆస్పత్రికి తరలించారు.

'షాలీమార్' ఎక్స్‌ప్రెస్ నుంచి జారిపడి..



క్షతగాత్రుడిని చికిత్సకు తరలిస్తున్న దృశ్యం

జూన్ 26వ తేదీన పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ తాళ్లభద్ర రైల్వేగేటుకు కిలోమీటరు దూరంలో రైలు నుంచి యువకుడు జారిపడి తీవ్రగాయాల పాలయ్యాడు. మధ్యాహ్నం రెండున్నర గంటల సమయంలో అతివేగంగా వచ్చిన షాలిమార్ సూపర్ ఫాస్ట్ రైలు ఒంపు తిరిగే క్రమంలో అసోంకు చెందిన యువకుడు ఇంద్ర బహదూర్ బోరో తీవ్రగాయాలపాలై పక్కన ఉన్న వరద కాలువలోకి పడిపోయాడు. గుర్తించిన గ్యాంగ్ మాన్, ఇతర ప్రయాణికులు అతడిని కాపాడారు.

నరకయాతన



షాలిమార్ ఎక్స్‌ప్రెస్ నుంచి గేటు వద్ద నిలబడి ప్రయాణిస్తూ నరక యాతన అనుభవిస్తున్నాను. జనరల్ బోగీలో కనీసం నిలబడడానికి కూడా చోటు లేదు. బాత్‌రూమ్‌లో కూడా ప్రయాణికులు ఉన్నారు. అన్ని రైళ్లలో ఇదేపరిస్థితి ఉంది. – బిసాయి సాహు, షాలిమార్ ఎక్స్‌ప్రెస్ ప్రయాణికుడు

టిక్కెట్ తీసి రైలు ఎక్కలేకపోయాం



శ్రీకాకుళం రోడ్ నుంచి విజయవాడకు వెళ్లేందుకు టిక్కెట్ తీసుకున్నాం. కానీ జనరల్ బోగీ ఎక్కలేకపోతున్నాం. ఒడిశా నుంచి వచ్చే ప్రయాణికులతో గేటు అంతా మూసుకుపోయి ఉంది. మేం మళ్లీ బస్సులోనే వెళ్లాం. – ఇప్పిలి మహేష్, నరసన్నపేట, ప్రయాణికుడు



రైలు పేరు: ఈస్ట్‌కోస్ట్ ఎక్స్‌ప్రెస్

రూట్: షాలిమార్ నుంచి హైదరాబాద్

గతంలో స్లీపర్ బోగీలు: 12	ప్రస్తుతం స్లీపర్ బోగీలు: 7
గతంలో ఏసీ బోగీలు: 6	ప్రస్తుతం ఏసీ బోగీలు: 11
గతంలో జనరల్ బోగీలు: 1	ప్రస్తుతం జనరల్ బోగీలు: 1

దివ్యాంగులు, మహిళలకు కలిపి ఒక బోగీ, లగేజీ, ఆర్ఎంఎస్‌కు ఒక బోగీ ఉంది.

సామాన్య ప్రయాణికుడిపై కేంద్రానికి ఉన్న 'ప్రేమ'కు ఈ లెక్కలే నిదర్శనాలు. అతి తక్కువ జనరల్, స్లీపర్ బోగీల్లో అత్యంత రద్దీగా ప్రయాణించలేక జనం నరకం చూస్తున్నారు. మరోవైపు కొన్ని నెలలు ముందు రిజర్వేషన్ చేసుకుంటే గానీ బెర్త్ దొరకడం లేదు.



రైలు పేరు: విశాఖ ఎక్స్‌ప్రెస్

రూట్: భువనేశ్వర్ నుంచి సికింద్రాబాద్

గతంలో స్లీపర్ బోగీలు: 12	ప్రస్తుతం స్లీపర్ బోగీలు: 3
గతంలో ఏసీ బోగీలు: 5	ప్రస్తుతం ఏసీ బోగీలు: 15
గతంలో జనరల్ బోగీలు: 3	ప్రస్తుతం జనరల్ బోగీలు: 2

దివ్యాంగులు, మహిళలకు కలిపి ఒక బోగీ, లగేజీ, ఆర్ఎంఎస్‌కు ఒక బోగీ ఉంది.

అవస్థలు పడుతున్నాం



దూరప్రాంతాలకు వెళ్లాలంటే చాలా అవస్థలు పడుతున్నాం. మాది భువనేశ్వర్ పక్కనే ఉన్న చిన్న గ్రామం. నా కుటుంబ సభ్యులతో కలసి హైదరాబాద్‌కు రోజు కూలి చేసుకునేందుకు వెళ్తున్నాం. రిజర్వేషన్ చేసే స్తోమత లేదు. ఇటు జనరల్ బోగీల్లో ఉండలేకపోతున్నాం. మరుగుదొడ్ల వద్ద ఉండి ప్రయాణాలు చేయాల్సి వస్తోంది. – అమిత్‌కుమార్ నాయక్, విశాఖ ఎక్స్‌ప్రెస్ ప్రయాణికుడు, భువనేశ్వర్

కుటుంబంతో ప్రయాణించేందుకు వస్తే..



మాలాంటి వాళ్లం కుటుంబంతో జనరల్ టికెట్ తీశామంటే వెళ్లలేం. రైళ్లు నిత్యం రద్దీగా ఉన్నా కనీసం ఎవ్వరూ పట్టించుకోవడం లేదు. – సల్మాండ్ రాజ్, మడపాం, ప్రయాణికుడు

- పైడిభీమవరం వద్ద అదుపు తప్పిన బైక్
- ఇద్దరు మృతి

రహదారి రక్తసిక్తం



ప్రమాద స్థలంలో ఆర్యని మృతదేహం (ఇన్‌సెట్లో) ఫ్లై ఓవర్ పై నుంచి కింద పడిన జీవన్ మృతదేహం



యమహా ఆర్ 15 వాహనం

రణస్థలం: పైడిభీమవరం జాతీయ రహదారి.. సమయం రాత్రి 8 గంటలు.. ఫ్లై ఓవర్‌పై లైట్లు లేవు.. చిమ్మ చీకటిగా ఉన్న ఆ ప్రాంతంలో నడిరోడ్డుపై అచేతనంగా ఓ మహిళ. ఫ్లై ఓవర్ కింద సర్వీసు రోడ్డుపై రక్తం ధారగట్టిన ఓ యువకుడు. ఎంత సేపు అలా పడి ఉన్నారో గానీ.. ఎవరి కంటా పడలేదు. ఓ టాటా మేజిక్ వాహనం అటుగా వస్తుండగా ఆ బండి వెలుతురులో వీరిద్దరూ కనిపించారు. ఓ కుర్రాడు దగ్గరకు వెళ్లి చూస్తే ఇద్దరికీ ప్రాణం లేదు. పైడి భీమవరం జాతీయ రహదారిపై మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మందస మండలం కుడుమసారి గ్రామానికి చెందిన సవర ఆర్యని(27), సవర జీవన్ కుమార్(20) మృతి చెందారు. వీరిద్దరూ వదినా మరిదులు. జేఆర్‌పురం పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. జీవన్‌కుమార్ సోదరుడు సవర వెంకటేష్ ఇద్దరూ పశ్చిమ గోదావరి జిల్లా తణుకులో వంట పనిచేస్తున్నారు. పొలం పనుల కోసం స్వగ్రామానికి రావడానికి జీవన్‌కుమార్‌తో పాటు అతని వదిన ఆర్యని తణుకులో మంగళవారం మధ్యాహ్నం రెండు గంటల సమయంలో బైక్‌పై బయల్దేరారు. పైడిభీమవరం ఫ్లై ఓవర్ పైన రాత్రి 8.10 గంటల సమయంలో లారీని అధిక స్పీడ్‌తో అధిగమించబోయి వీరి బండి అదుపు తప్పింది. దీంతో వెనుక కూర్చున్న వదిన సవర ఆర్యని(27) ఫ్లై ఓవర్ రోడ్డుపై పడిపోయింది. స్పీడ్ వల్ల బండి మరో 30 మీటర్లు దూరం వెళ్లి ఫ్లై ఓవర్ గోడను ఢీకొట్టింది. దీంతో బండి నడుపుతున్న జీవన్‌కుమార్ అక్కడి నుంచి కింద సర్వీస్ రోడ్డుపై పడిపోయి మృతి చెందాడు. అదే సమయానికి వీరు ఏ లారీని అధిగమించబోయి ప్రమాదానికి గురయ్యారో.. అదే లారీని మరో లగేజీ వ్యాన్ ఢీకొట్టింది. అయితే ఇరు వాహనాల వారు సెటిల్ చేసుకుని వెళ్లిపోవడం గమనార్హం. ఫ్లై ఓవర్‌పై లైట్లు లేకపోవడంతో ప్రమాదం జరిగిన సంగతి చాలా సేపటి వరకు ఎవరికీ తెలియలేదు. అదే దారిలో టాటా మేజిక్ వాహనంలో వచ్చిన ఒక కుర్రోడు ప్రమాద దృశ్యాలను చూసి వాళ్ల కుటుంబ సభ్యులకు, పోలీసులకు తెలియజేశారు. మృతురాలికి ఐదేళ్ల కుమార్తె హరిణి ఉంది. అంబులెన్స్ సమయానికి వచ్చి ఉంటే ఆర్యని బతికి ఉండేదని కొందరు తెలిపారు. సంఘటన స్థలాన్ని జేఆర్ పురం ఎస్ఐ కె.గోవిందరావు పరిశీలించి వివరాలు సేకరించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు. మృతదేహాలను శవపంచనామా నిమిత్తం శ్రీకాకుళం సర్వజనాస్పత్రికి తరలించారు.

యాక్సిడెంట్ స్పాట్ వాచ్

- ప్రమాదానికి అతివేగమే కారణమని తెలుస్తోంది.
- హైవే ఫ్లై ఓవర్‌పైన హై స్పీడ్ బోర్డర్ నుంచి నార్మల్ స్పీడ్ బోర్డర్‌కు ఒకే సారి కర్వ్ డ్రైవ్ చేశాడు.
- ప్రమాదం జరిగిన సమయంలో బండి వేగం 100కు పైగానే ఉంది.
- బండి నడుపుతున్న వ్యక్తి హెల్మెట్ ధరించలేదు.
- ఫ్లై ఓవర్ గోడను ఢీ కొని కింద ఉన్న సర్వీస్ రోడ్‌లో పడిపోయి.. వెంటనే మరణించారు.
- లారీని వేగంగా అధిగమించే క్రమంలో బండిని డ్రైవ్ చేయడంతో స్కిడ్ అయింది.
- ఈ క్రమంలో వెనక్కు కూర్చున్న మహిళ జారిపోయింది. శిరస్త్రాణం ధరించి ఉన్నా.. బలంగా ఒకే సారి రోడ్డును తాకడంతో తీవ్ర రక్తస్రావం జరిగింది.
- సమయానికి అంబులెన్స్ రాకపోవడం.. ఫ్లై వోవర్ మీద లైట్లు లేక.. మహిళను ఆస్పత్రికి సరైన సమయంలో తరలించలేకపోవడంతో ఆమె కూడా ప్రాణాలు విడిచింది.
- మధ్యాహ్నం 2 గంటల నుంచి ప్రయాణంలో ఉండడం.. 300 కిలోమీటర్ల ప్రయాణంలో తీవ్ర అలసటకు గురికావడం కూడా ఒక కారణమని పోలీసులు, ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు.

నేడు పాలిటెక్నిక్ స్పాట్ అడ్మిషన్లు

ఎచ్చెర్ల క్యాంపస్: పాలీసెట్-2024 రెండు విడతలు కౌన్సెలింగ్ పూర్తి కాగా, కళాశాలల్లో మిగులు సీట్లకు బుధవారం స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నారు. విద్యార్థులు నేరుగా 9.30 గంటలకు కళాశాలను సంప్రదించాల్సి ఉంటుంది. జిల్లాలో ఐదు ప్రభుత్వ, ఐదు ప్రైవేట్ పాలిటెక్నిక్ కళాశాలలు ఉన్నాయి. శ్రీకాకుళం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, శ్రీకాకుళం ప్రభుత్వ మహిళల పాలిటెక్నిక్ కళాశాల, ఆమదాలవలస, టెక్కలి, సీతంపేట ప్రభుత్వ కళాశాలలు ఉన్నాయి. ఉదయం దరఖాస్తుల స్వీకరణ, మధ్యాహ్నం ప్రవేశాలు కల్పిస్తారు. టెక్కలి, సీతంపేట ప్రభుత్వ కళాశాలల్లో ఎక్కువగా ఖాళీ సీట్లు ఉన్నాయి. శ్రీకాకుళం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో నాన్ ఇంజినీరింగ్ బ్రాంచ్ సీసీపీలో ఎక్కువగా ఖాళీలు ఉన్నాయి. స్పాట్ ప్రవేశాలకు సంబంధించి ఫీజు రీయింబర్స్‌మెంట్ వర్తించదు. కళాశాల ఫీజు స్ట్రక్చర్ మేరకు విద్యార్థులు ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. ఆసక్తి గల విద్యార్థులు స్పాట్ ప్రవేశాలు సద్వినియోగం చేసుకోవాలని శ్రీకాకుళం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్, జిల్లా ప్రవేశాల కన్వీనర్ జి.దామోదర్‌రావు తెలిపారు.

క్లుప్తంగా

కనిమెట్టలో బహిరంగ ప్రదేశంలో మందులు



చెత్తకుప్పలో పారబోసిన మందులు

పొందూరు: మండలంలోని కనిమెట్ట గ్రామంలో మంగళవారం బహిరంగ ప్రదేశాల్లో ప్రభుత్వ ఆస్పత్రిలో అందించే మందులు దర్శనమిచ్చాయి. కాలం తీరిన మందులైనా సరే జాగ్రత్తగా డిస్పోజ్ చేయాల్సి ఉంటుంది. కానీ ఇలా చెత్త కుప్పలు, పాడుపడిన బావుల్లో మందులు వేస్తుండడంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

తోటి విద్యార్థి కోసం..



విద్యార్థికి నగదును అందిస్తున్న డిప్యూటీ డీఈఓ విజయలక్ష్మి, ఉపాధ్యాయులు

జి.సిగడాం: తోటి విద్యార్థి కష్టంలో ఉన్నాడని తెలుసుకుని విద్యార్థులంతా చేయి చేయి కలిపారు. ఆ విద్యార్థి వైద్యం కోసం రూ.90వేలు సేకరించారు. వీరికి ఉపాధ్యాయులు కూడా జత కలిసి మరో రూ.60వేలు అందించారు. మండలంలోని డీఆర్‌వలస జెడ్పీ పాఠశాలో 9వ తరగతి చదువుతున్న కాకర్లపూడి వెంకట లఖిత్ రామరాజు గుండె, చెవి వ్యాధితో బాధపడుతున్నాడని, వైద్యం కోసం సుమారుగా రూ.25 లక్షలు ఖర్చవుతుందని వైద్యులు తెలిపారు. దీంతో పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు రూ.1.50 లక్షలు పోగేసి మంగళవారం విద్యార్థుల తల్లిదండ్రులకు అందజేశారు. శ్రీకాకుళం డివిజల్ ఉప విద్యా అధికారి ఆర్.విజయలక్ష్మి, ప్రధానోపాధ్యాయుడు కూర్మినాయుడు చేతులమీదుగా ఈ సాయం అందించారు. ఉప విద్యాశాఖాధికారి విజయలక్ష్మి అదనంగా రూ.5 వేలు అందించారు.

చిన్నారావు చూపు సజీవం



నేత్రదాత చిన్నారావు

శ్రీకాకుళం కల్చరల్: పట్టణంలోని బలగ బావాజీ తోటలో నివాసం ఉంటున్న చింతనిప్పుల చిన్నారావు (72) అనారోగ్య కారణంగా మంగళవారం మృతి చెందారు. మరణానంతరం ఆయన నేత్రాలు ఇతరులకు ఉపయోగపడాలనే సదుద్దేశంతో ఆయన కుటుంబ సభ్యులు సీహెచ్ సావిత్రి, వేంకటేష్, గిరీష్, అరుణ, మోహనరావు, భారతి, డాక్టర్ పి.సుందరయ్యలు నేత్రాలను దానం చేసేందుకు ముందుకు వచ్చారు. ఈ విషయం రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావుకు తెలియజేయగా, నేత్ర సేకరణ కేంద్రం టెక్నికల్ ఇన్‌చార్జి సుజాత, సహాయకులు బి.జగదీష్ కార్నియాలను సేకరించి విశాఖలోని ఎల్‌వీ ప్రసాద్ నేత్ర సేకరణ కేంద్రానికి అందజేశారు. దాత కుటుంబ సభ్యులకు రెడ్‌క్రాస్ చైర్మన్ జగన్మోహనరావు, కార్యదర్శి బి.మల్లేశ్వరరావు, సభ్యులు దుర్గాశ్రీనివాస్‌లు అభినందించారు. నేత్రదానం చేయాలనుకునేవారు 7842699321 నంబరుకు కాల్ చేయాలని కోరారు.

చేపల మృత్యువాతతో ఆందోళన



చెరువులో తేలుతున్న చనిపోయిన చేపలు

టెక్కలి రూరల్: టెక్కలి మేజర్ పంచాయతీ పరిధి దుంపల చెరువులో గత కొద్ది రోజులుగా చేపలు మృత్యువాత చెందుతుండటంతో చేపల పెంపకందారులు ఆందోళనకు గురవుతున్నారు. మంగళవారం ఒక్క రోజే అధిక సంఖ్యలో చేపలు చనిపోయి నీటిపై తేలిపోయాయి. ఈ చెరువులోనే వ్యర్థాలు, ప్లాస్టిక్ వ్యర్థాలు అధికంగా ఉండటంతో చెరువు కలుషితం కావడం వల్లనే చేపలు చనిపోయి ఉంటాయని స్థానికులంటున్నారు. అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని చేపల పెంపకదారులు కోరుతున్నారు.

కిడ్నీ వ్యాధితో కానిస్టేబుల్ మృతి

శ్రీకాకుళం క్రైమ్ : నగరంలోని రెండో పట్టణ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వర్తిస్తున్న ఎస్.మాధవరావు అనే కానిస్టేబుల్ కిడ్నీ వ్యాధితో బాధపడుతూ విజయవాడ ఎన్ఆర్ఐ ఆస్పత్రిలో మంగళవారం ఉదయం మృతిచెందినట్లు రైటర్ సింహాచలం తెలిపారు. మాధవరావు సొంత గ్రామం జలుమూరు మండలం కొత్తకోట కాగా.. నగరంలోని దమ్మలవీధిలో నివాసం ఉంటున్నారు. గత కొంతకాలంగా వ్యాధితో బాధపడుతున్న మాధవరావు మార్చి 1 నుంచి సెలవులో ఉన్నారని, ఇతనికి భార్య, పిల్లలు ఉన్నారని తెలిపారు. మాధవరావు మృతిపై సీఐ ఉమామహేశ్వరరావు, ఎస్ఐ హరికృష్ణ, స్టేషన్ సిబ్బంది సానుభూతి వ్యక్తం చేశారు.



నీరు తాగలేకపోతున్నాం బాబోయ్

టెక్కలి పంచాయతీ పరిధిలోని పలు ప్రాంతాలకు కుళాయిల ద్వారా రంగు మారిన నీరు వస్తోంది. ఈ నీరు తాగేందుకు ప్రజలు జంకుతున్నారు. పలు ప్రాంతాల్లో డయేరియా ప్రబలుతుండడంతో వారంతా భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి తాగునీటిని క్లోరినేషన్ చెయ్యాలని కోరుతున్నారు.

– టెక్కలి రూరల్

తహసీల్'దారులెటో'..?

- తహసీల్దార్ నియామకాల్లో జాప్యం
- సిఫార్సులు, మార్పులు, చేర్పులతో ఆలస్యం



శ్రీకాకుళం పాతబస్టాండ్: తహసీల్దార్లకు ఏ దారీ పాలుపోకుండా ఉంది. వీరంతా జిల్లాకు వచ్చి మూడు రోజులైపోయింది. వారికి ఇంకా మండలాలు, కలెక్టరేట్‌లో సెక్షన్లు, ఆర్డీఓ కార్యాలయం, ఇతర సర్వీసుల్లో నియామకాలు జరగలేదు. ఈ నియామకం కోసం కొంతమంది ఎదురు చూస్తుంటే, మరికొందరు ఎమ్మెల్యేల సిఫారసు లేఖలతో కావాల్సిన చోటుకు వెళ్లడానికి పైరవీలు చేసుకుంటున్నారు. ఇప్పటికే సరాసరి అన్ని నియోజకవర్గాల్లోని మండలాలకు సంబంధించిన సిఫార్సు లేఖలు కలెక్టరేట్‌కు చేరాయి. అయితే ఈ సారి తహసీల్దార్ల నియామకంలో ఎక్కువ సిఫార్సు లేఖలు పొందిన వారికే లేఖల ప్రాప్తికి పోస్టింగ్ ఇవ్వాలని ప్రభుత్వం అధికారులకు మౌఖికాదేశాలు జారీ చేసింది. నేరుగా పిలిపించిన వారికే ఇవ్వాలని చెప్పడంతో ఈ లేఖలకు ప్రాధాన్యత పెరిగింది.

జిల్లాలో 8 శాసన సభ నియోజకవర్గాల పరిధిలో ఉన్న 30 మండలాలకు సిఫార్సు లేఖలు కలెక్టరేట్‌కి చేరాయి. అయితే అధికారులు కూడా చేసిందేమీ లేక, వారి ఒత్తిళ్లకు లోబడి పోస్టింగ్ జాబితాలు తయారు చేయడంలో నిమగ్నమయ్యారు. ముందుగా కలెక్టరేట్‌కి పంపిన లేఖలకు భిన్నంగా మరోసారి లేఖలు రావడంతో అధికారులు కొంత ఇబ్బంది పడుతున్నట్టు తెలుస్తోంది. దీంతో మండలాల్లో తహసీల్దార్ల పోస్టింగ్ విషయంలో జాప్యం తప్పడం లేదు.

కలెక్టరేట్‌లో ఏఓ, ఇతర సెక్షన్ సూపరింటెండెంట్‌ల విషయంలో ఇంకా అధికారులకు స్పష్టత రాలేదు. గతంలో పనిచేసిన ఏఓ, సూపరింటెండెంట్లకు ఈ సారి అక్కడ పోస్టింగ్ ఇవ్వవద్దని రెవెన్యూ సర్వీసుల సంఘం, ఇతర రెవెన్యూ ఉద్యోగులు జిల్లా కలెక్టర్, జేసీల దృష్టికి తీసుకువెళ్లారు. కానీ ఇక్కడ గతంలో పనిచేసిన వారు మళ్లీ ఎలాగైనా ఇక్కడకే వచ్చేందుకు విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారు. తహసీల్దార్ నియామకాల్లో ఇటు ప్రజా ప్రతినిధుల సిఫార్సులు, మరోవైపు ఉన్నతాధికారుల ఆదేశాలు, గతంలో ఉన్న అవినీతి ఆరోపణలు అన్నింటినీ బేరీజు వేసుకుని పని పూర్తి చేయాల్సి ఉంటుంది. ఈ పరిస్థితి జిల్లా ఉన్నతాధికారులకు తలనొప్పి తెచ్చి పెడుతోంది.

ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట

సాక్షి ఎఫెక్ట్



జలుమూరు: పర్లాం గ్రామం సమీప వంశధార నది నుంచి జరుగుతున్న ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేశామని ఇన్‌చార్జి తహసీల్దార్ ఎన్.తిరుపతిరావు అన్నారు. మంగళవారం సాక్షిలో 'ఇసుక తోడేళ్లు' అన్న శీర్షికన వచ్చిన కథనానికి ఆయన స్పందించి రెవెన్యూ సిబ్బందిని అప్రమత్తం చేశారు. వంశధార నది నుంచి లారీలు, ట్రాక్టర్ల ద్వారా ఇసుక రవాణా జరగకుండా ఆయా మార్గాల్లో ట్రెంచ్‌లు ఏర్పాటు చేశారు. వేరే మార్గాల ద్వారా ఇసుక అక్రమంగా రవాణ జరగకుండా రెవెన్యూ పరిశీలకుల పర్యవేక్షణతో 24 గంటలు స్థానిక రెవెన్యూ సిబ్బందిని విధులు నిర్వహించేందుకు నియమించారు. ఇసుకతో దొరికితే వాహనాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు. ఇసుక తరలింపునకు ఎలాంటి అనుమతులు లేవని తెలిపారు. ఆయనతోపాటు ఆర్ఐ సతీష్, రెవెన్యూసిబ్బంది ఉన్నారు.



పర్లాం నది వద్ద ట్రెంచ్స్ ఏర్పాటు చేస్తున్న తహసీల్దార్ తిరుపతిరావు, సిబ్బంది

ఓవీ పేట వీఆర్వోపై దాడి



శ్రీకాకుళం రిమ్స్‌లో వైద్యం పొందుతున్న వీఆర్వో వ్యాపార లక్ష్మీనారాయణ

బూర్జ: స్థానిక వీఆర్‌ఓ వ్యాపార లక్ష్మీనారాయణపై పలువురు రైతులు మంగళవారం దాడికి పాల్పడ్డారు. ప్రస్తుతం ఆయన ఆస్పత్రిలో ఉన్నారు. వివరాల్లోకి వెళితే.. లక్ష్మీనారాయణకు బూర్జ గ్రామంలో వ్యవసాయ భూములు ఉన్నాయి. అదే గ్రామానికి చెందిన పిల్లా వెంకటరావు, ముద్దాడ లక్ష్మణరావు (చింతయ్య)లు లక్ష్మీనారాయణ భూముల పక్కన కొంత భూమిని కౌలుకు తీసుకుని సాగు చేస్తున్నారు. గత ఏడాది వీరి మధ్య సాగునీటి విషయమై గొడవ జరిగింది. ఈ ఏడాది కూడా ఆ గొడవలు కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో మంగళవారం ఉదయం లక్ష్మీనారాయణ తన విధుల్లో భాగంగా ఓవీ పేట వెళ్తుండగా ఆంజనేయ స్వామి దేవాలయం వద్ద ప్రధాన రహదారిపై మిగిలిన వారు దారికాచి దాడికి పాల్పడ్డారు. ముక్కు, తలపైన గాయం కావడంతో వీఆర్వో అక్కడే పడిపోయాడు. స్థానికులు గమనించి 108 సాయంతో ఆయనను శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. రిమ్స్ అవుట్‌పోస్టు సిబ్బంది ఇచ్చిన సమాచారం మేరకు బూర్జ పోలీసు స్టేషన్ హెచ్‌సీ పి.సూర్యనారాయణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. వీఆర్వోను కళింగ సంక్షేమ సేవా సంఘం రాష్ట్ర గౌర వాధ్యక్షుడు బుడుమూరు శ్రీరామమూర్తి, సామాజిక కార్యకర్త బీవీఎస్ఎన్ రాజు, ఓవీ పేట సచివాలయం వెల్ఫేర్ అసిస్టెంటు పొన్నాడ త్రినాథరావు తదితరులు పరామర్శించారు.

పుట్టగొడుగుల కూర తిని నలుగురికి అస్వస్థత

వజ్రపుకొత్తూరు రూరల్: పుట్ట గొడుగుల కూర తిని ఒకే కుటుంబంలో నలుగురు వ్యక్తులు అస్వస్థతకు గురైన ఘటన మంగళవారం మండలం పెద్దబొడ్డపాడు పంచాయతీ పరిధిలో గల సీతాపురంలో చోటు చేసుకుంది. ఇటీవల కురిసిన వర్షాలకు గ్రామ పరిసర కొబ్బరి తోటలో పుట్టగొడుగులు పుట్టుకు వచ్చాయి. కోటి భాస్కరరావు అనే వ్యక్తి పుట్ట గొడుగులను సేకరించి ఇంటికి తీసుకువచ్చాడు. ఇంటిలో కూర చేసుకుని తిన్న కొద్ది సేపటికి బాధితులు కోటి జయమ్మ, కోటి వామాక్షి, కోటి పద్మ, యోగిలకు వాంతులు, విరేచనాలు కావడంతో అస్వస్థతకు గురయ్యారు. దీంతో స్థానికులు 108 వాహనానికి సమాచారం ఇవ్వడంతో పలాస ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

● ఎన్నాళ్లకెన్నాళ్లకు..



స్థానిక కేవీఎస్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో 1970 నుంచి 1975 వరకు చదివిన వారు మంగళవారం మళ్లీ కలుసుకున్నారు. నాటి జ్ఞాపకాలు గుర్తు చేసుకుని ఆనందంగా గడిపారు. తమకు చదువు చెప్పిన గురువులు కె.గాలి మోహనరావు, యు.పోలినాయుడు, ఇ.బుచ్చిబాబు, టి.సోంబాబు, కె.లక్ష్మణమూర్తి, వై.గురన్న, వి.కుమారస్వామి, ఎస్.మధుసూదనరావు, పి.తులసిరావులను సత్కరించారు. – జలుమూరు

ప్రాసెసింగ్ సెంటర్ల పరిశీలన



జీడి ప్రాసెసింగ్‌లో పీఓ రాహుల్ కుమార్ రెడ్డి

కొత్తూరు: మండలంలోని మహసింగి గ్రామం సమీపంలోని ఆర్టిక్ ఎస్‌జీఓ భవనాల్లో మహిళా సంఘాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పసుపు, కొండ చీపుర్ల ప్రాసెసింగ్ సెంటర్లను సీతంపేట ఐటీడీఏ పీఓ రాహుల్ కుమార్ రెడ్డి మంగళవారం పరిశీలించారు. ప్రాసెసింగ్ సెంటర్‌కు కొనుగోలు చేసిన పసుపు, కొండచీపుర్లు, జీడి పిక్కల నిల్వల గురించి ఆరా తీశారు. సెంటర్ నిర్వహణపై ఏపీఎం జనార్ధన నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. మూడు సెంటర్లకు సరుకులు విక్రయించిన రైతులతో పీఓ మాట్లాడారు. ప్రస్తుతం రూ.30 వేలు లాభాలతో నడుస్తున్నట్లు ఏపీఎం పీఓకు చెప్పారు. కార్యక్రమంలో ఐబీ ఏపీఎం త్రినాథమ్మ, సీసీలు అరుణ జ్యోతి, చంద్రరావు, కనకలక్ష్మి, ప్రమీల, వీఓ మణికుమారి, గౌరీకళ, సంధ్యారాణి ఉన్నారు

మూడు రోజుల్లో 24 కేసులు

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లా కేంద్రంలో మైనర్ల ఆగడాలకు పోలీసులు అడ్డుకట్ట వేశారు. ట్రాఫిక్ సీఐ ఎం.అవతారం ఆధ్వర్యంలో మూడురోజుల పాటు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించగా 24 మంది మైనర్లు ద్విచక్రవాహనాలు నడుపుతూ పట్టుబడ్డారు. ఒక్కొక్కరికీ రూ. 1500 చొప్పున మొత్తం రూ. 36 వేలు ఫైన్ వేశారు. వారి తల్లిదండ్రులను మంగళవారం రాత్రి ట్రాఫిక్ సీఐ స్టేషన్‌కు పిలిపించి కౌన్సిలింగ్ చేశారు.

కూటమి ప్రభుత్వం మాట మార్చుతోంది

● ఎమ్మెల్సీ నర్తు రామారావు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ నర్తు రామారావు

ఇచ్ఛాపురం /రూరల్: కూటమి ప్రభుత్వం హామీలపై మాట మార్చుతోందని, ప్రశ్నించే వారిపై అణచివేత ధోరణి ప్రదర్శిస్తోందని ఎమ్మెల్సీ నర్తు రామారావు దుయ్యబట్టారు. స్థానిక మున్సిపాలిటీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ బాగాలేనందున సూపర్ సిక్స్ పథకాలను అమలు పరచడంలో తాను ముందుకు వెళ్లలేని పరిస్థితిలో ఉన్నానంటూ సీఎం చంద్రబాబు అసెంబ్లీ వేదికగా రాష్ట్ర ప్రజలకు సందేశం పంపించడం సిగ్గుచేటని అన్నారు. 2019లో అప్పటి సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన సమయంలో రాష్ట్ర ఖజానాలో కేవలం రూ.100 కోట్లు ఉన్నప్పటికీ రాష్ట్ర సంక్షేమం, పథకాలు అమలులో రాజీ పడకుండా కరోనా కష్ట కాలంలో సైతం ఏ ఒక్క పథకం కూడా ఆపకుండా అమలు చేశారని గుర్తు చేశారు. ఎన్నికల సమయంలో చంద్రబాబు, అతని మీడియా ఈ రాష్ట్రానికి అప్పులు రూ.14లక్షల కోట్లు అంటూ ఊదరగొట్టాయని, తీరా సీఎంగా సీట్లో కూర్చుని లెక్కలు చూసే సరికి ఎన్ని పిల్లి మొగ్గలు వేసినా ఆ నంబర్ కనిపించలేదని, చివరికి గవర్నర్ ప్రసంగం వచ్చే సరికి రూ.10లక్షల కోట్లకు తగ్గించి సాక్షాత్ రాష్ట్ర గవర్నర్ చేత కూడా అబద్ధాలు చెప్పించారని దుయ్యబట్టారు. వలంటీర్లకు రూ.10 వేలు ఇస్తానని వారిని రోడ్డున పడేశారని, రైతు భరోసా, మత్స్యకార భరోసా, నిరుద్యోగ భృతి, అమ్మకు వందనం, ప్రతి మహిళకు నెలకు రూ.1500 సాయం, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, మహిళలకు ఉచితంగా మూడు గ్యాస్ సిలిండర్లు ఇస్తామంటూ సూపర్ సిక్స్ పేరిట కూటమి నేతలు ప్రజల్లోకి వెళ్లారని, ప్రజలు ఆకర్షితులై కూటమి ప్రభుత్వానికి పట్టం కడితే ఇలా దగా చేయడం సరికాదని అన్నారు. ఎన్నికల్లో ప్రకటించిన ప్రతి పథకాన్ని అమలు చేయాలని, లేకుంటే వైఎస్సార్‌సీపీ ప్రజల పక్షాన కూటమి ప్రభుత్వంపై పోరాడేందుకు సిద్ధంగా ఉందని అన్నారు. సమావేశంలో మున్సిపాలిటీ చైర్‌పర్సన్ పిలక రాజ్యలక్ష్మి, ఎంపీపీ బోర పుష్ప, మున్సిపాలిటీ వైస్ చైర్‌పర్సన్ ఉలాల భారతి దివ్య, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు ప్రకాశరావు పట్నాయక్, కౌన్సిలర్లు బచ్చు జగన్, సుగ్గు ప్రేమ్‌కుమార్, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు దక్కత నూకయ్యరెడ్డి, ఇప్పిలి కృష్ణారావు, ఆశి పురుషోత్తమరెడ్డి, లాభాల శంకరరావు, ఆశి కృష్ణారెడ్డి, కిరణ్, పిలక మోహనరావులు పాల్గొన్నారు.

'అసమానతలు లేని సమాజం రావాలి'



అమరవీరులకు నివాళులర్పిస్తున్న నాయకులు

పలాస: అసమానతలు లేని సమాజం కోసం పోరాటం చేసి అసువులు బాసిన అమర వీరుల బాటలో ప్రతి ఒక్కరు నడవాలని సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి వంకల మాధవరావు పిలుపునిచ్చారు. పలాస సూదికొండలోని ఆ పార్టీ కార్యాలయంలో మంగళవారం శ్రీకాకుళం గిరిజన రైతాంగ సాయుధ పోరాటంలో అమరులైన డాక్టరు మల్లికార్జున్, దుమ్ము అప్పలస్వామి, ఉర్లాం మల్లేశ్వరరావుల 52వ వర్ధంతి సభను ఘనంగా నిర్వహించారు. వారి చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాధవరావు మాట్లాడుతూ ఆదివాసీల హక్కుల కోసం, పీడిత తాడిత ప్రజల ప్రయోజనాల కోసం పోరాడిన ఈ అమర వీరులను మందస మండలం రామరాయి కొండల్లో పట్టుకొని పోలీసులు అతి కిరాతకంగా కాల్చి చంపారని ఆవేదన వ్యక్తం చేశారు. డాక్టర్ మల్లికార్జున రావు తన వైద్య వృత్తిని వదులుకుని శ్రీకాకుళ గిరిజన సాయుధ రైతాంగ పోరాటంలో పాల్గొన్నారని గుర్తు చేశారు. అమర వీరుల ఆశయాలకు అనుగుణంగా నేటి యువత నడుచుకోవాలని కోరారు. కార్యక్రమంలో రైతుకూలీ సంఘం జిల్లా అధ్యక్షుడు మామిడి భీమారావు, వంకల పాపయ్య, మురిపింటి తాతారావు, జుత్తు కృష్ణారావు, సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

జిల్లాకు ఒడియా పుస్తకాలు



ఒడిశాలో పుస్తకాలు తీసుకువస్తున్న అపోటా సంఘం నేతలు

కవిటి: జిల్లాలో ఒడియా మాధ్యమం చదువుతున్న విద్యార్థులకు రూ. 2లక్షల విలువ చేసే 9,10 వ తరగతులకు సంబంధించి ప్రథమ భాష(ఒడియా) పుస్తకాలు జిల్లాకు చేరాయి. మంగళవారం ఈ మేరకు ఏపీ ఒడియా టీచర్స్ అసోసియేషన్ (అపోటా) ప్రతినిధులు తెలిపారు. ఒడియా సాహిత్య సింధు 1270 పుస్తకాలు సాహిత్య ధారా 1250 పుస్తకాలు, ఒడియా వ్యాకరణం 2520 పుస్తకాలు ఉన్నాయి. వీటిని ఒడిశా ప్రాంతీయ మాధ్యమిక బోర్డు బరంపురం జోన్ అసిస్టెంట్ సెక్రటరీ సనాతన బిసోయ్, శ్రీకాకుళం జిల్లా ఒడియా డీఐ దుర్గా ప్రసాద్ చౌధురీకి బరంపురం ప్రాంతీయ మాధ్యమిక బోర్డు కార్యాలయంలో అందజేశారు. వాటిని శ్రీకాకుళం జిల్లాలోని అన్ని ఒడియా మీడియం ఉన్న పాఠశాలలకు తరలించే ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.

గాయానికి ఒక రేటు..!



రోగులకు కట్టులు కట్టి డబ్బులు వసూలు చేస్తున్నారనే విమర్శలు ఉన్న వార్డు ఇదే

టెక్కలి రూరల్: టెక్కలి జిల్లా ఆస్పత్రిలోని సిబ్బంది చేతివాటం చూపిస్తున్నారు. గాయపడిన వారు ఎవరైనా ఆస్పత్రిలో చేరితే వైద్యుడు పరీక్షించిన అనంతరం ఆ గాయానికి కట్టు కట్టాలంటే వారు కట్టే కట్టుని బట్టి అక్కడ ఒక రేటు నిర్ణయిస్తున్నారు. ముఖ్యంగా డ్రస్సింగ్ రూంలో ఉన్న కొంత మంది సిబ్బంది గాయాలకు గురైన వ్యక్తిని రూంలోకి తీసుకువెళ్లి వారికి అయిన గాయానికి కట్టుకట్టి చిన్నకట్టుకి రూ.100 నుంచి పెద్ద కట్టుకి రూ.300వరకు వసూలు చేస్తున్నారని రోగులు వాపోతున్నారు. ఎవరైనా డబ్బులు ఇవ్వక పోతే వారితో గొడవ పడి మరీ డబ్బులు వసూలు చేస్తున్నారని రోగులతో పాటు ఆస్పత్రి సిబ్బంది సైతం చెబుతుండటం గమనించదగ్గ విషయం. ఇప్పటికైనా ఉన్నత స్థాయి అధికాలు స్పందించి ఎలాంటి లంచాలు లేకుండా పేద ప్రజలకు ఉచిత వైద్యం అందే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లో రాగి చోరీ



కిట్టాలపాడులో ఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

హిరమండలం: కిట్టాలపాడు పొలాల్లో సోమవారం రాత్రి చోరీ జరిగింది. ఎత్తిపోతల పథకానికి సంబంధించి ట్రాన్స్‌ఫార్మర్‌లో విలువైన లోహాన్ని తొలగించి పట్టుకుపోయారు. గ్రామానికి రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న ఎత్తిపోతల పథకం వద్దకు రైతులు లేని సమయంలో వచ్చిన దొంగలు విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. అందులో ఉన్న (కోర్)రాగి లోహంతో పాటు ఆయిల్‌ను పట్టుకుపోయారు. దీంతో రైతులు వెంటనే విద్యుత్ శాఖ, పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ నారాయణస్వామి ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. సమగ్ర దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. అలాగే స్థానిక ఎమ్మెల్యే మామిడి గోవిందరావుకు రైతులు వినతిపత్రం అందించారు. ఎత్తిపోతల పథకానికి కొత్త ట్రాన్స్‌ఫార్మర్ మంజూరు చేయాలని రైతులు కోరుతున్నారు. ఎత్తిపోతల పథకం సుమారు 600 ఎకరాలకు సాగునీరు అందిస్తుందన్నారు. ట్రాన్స్‌ఫార్మర్ లేక, సాగునీరు అందక పంట పొలాలు ఎండిపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

'సోషల్ మీడియాతో జాగ్రత్త'



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి ఆర్.సన్యాసినాయుడు

శ్రీకాకుళం న్యూకాలనీ: నమ్మకం ఉన్న చోటే మోసం జరుగుతుందని, ఎవరినైతే నమ్ముతామో వారే మోసం చేస్తారని, అపరిచితులకు, చెడు ప్రభావాలకు ముఖ్యంగా బాలికలు దూరంగా ఉండాలని సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయశాఖ అధికారి సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసి నాయుడు విద్యార్థినులకు సూచించారు. ఏపీ రాష్ట్ర న్యాయ సేవాధికారి సంస్థ ఆదేశాల మేరకు, జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయశాఖ అధికారి సంస్థల ఆదేశానుసారం జిల్లాలో చేపడుతున్న న్యాయ విజ్ఞాన సదస్సుల్లో భాగంగా మంగళవారం శ్రీకాకుళం ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో వివిధ చట్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ముఖ్యంగా మానవ అక్రమ రవాణాను అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా, అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. విద్యార్థులపై సోషల్‌మీడియా విపరీతంగా ప్రభావం చూపిస్తోందన్నారు. సోషల్ మీడియా చెడు ప్రభావాలకు దూరంగా ఉండి బంగారు భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలన్నారు. మానవ అక్రమ రవాణాలో మహిళలే ఎక్కువగా బాధితులుగా ఉన్నారని తెలిపారు. ఆడపిల్లలను వ్యభిచార గృహాలకి విక్రయించేస్తున్నారని హెచ్చరించారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎం.కృష్ణవేణి మాట్లాడుతు తమ కళాశాలలో న్యాయవిజ్ఞాన సదస్సును ఏర్పాటుచేసి, బాలికలను చైతన్యపరిచిన న్యాయసేవాధికారి సంస్థకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో అడ్వకేట్ గేదెల ఇందిరాప్రసాద్, అధ్యాపకులు పాల్గొన్నారు.

పదోన్నతి ఉత్తర్వుల అందజేత



పదోన్నతి ఉత్తర్వులు అందజేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ విజయ

అరసవల్లి: జెడ్పీ యాజమాన్యంలోని ఉన్నత పాఠశాలల్లో పనిచేస్తున్న ఇద్దరు రికార్డు సహాయకులకు జూనియర్ సహాయకులుగా పదోన్నతి కల్పిస్తూ జెడ్పీ చైర్ పర్సన్ పిరియా విజయ ఉత్తర్వులు జారీ చేసి నియామక పత్రాలు అందజేశారు. కొరసవాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రికార్డు అసిస్టెంట్‌గా పనిచేస్తున్న ఓ.కృష్ణవేణిని చిన్నబాడాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల జూనియర్ సహాయకులుగా వేశారు. జి.సిగడాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రికార్డు అసిస్టెంట్‌గా పనిచేస్తున్న ఈవీ కృష్ణారావును కొత్తపేటలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల జూనియర్ సహాయకులుగా బదిలీ చేశారు. అలాగే పైడి భీమవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న నైట్‌వాచర్ కె.సూర్యకుమారిని కోడూరులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు ఆఫీస్ సబార్డినేట్‌గా, సంతవురిటిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నైట్ వాచర్‌గా పనిచేస్తున్న బి.రమణను ఎచ్చెర్ల మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఆఫీస్ సబార్డినేట్‌గా నియమిస్తూ నియామక పత్రాలను ఇరువురికీ అందజేశారు.